హెచ్‌పీ పవర్‌ఫుల్ ల్యాప్‌టాప్‌లు

ఓమ్నీబుక్ ఎక్స్, ఎలైట్‌బుక్ అల్ట్రా పేరిట ఆవిష్కరణ

ధరల శ్రేణి రూ.1,39,999-1,69,934 ● అర గంటలో 50% చార్జింగ్

బెంగళూరు, జూలై 29: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం హెచ్‌పీ.. ఇప్పటిదాకా ఆవిష్కరించని అత్యంత శక్తివంతమైన పీసీలను తీసుకొచ్చింది. సోమవారం ఓమ్నీబుక్ ఎక్స్, ఎలైట్‌బుక్ అల్ట్రా పేరిట రెండు పవర్‌ఫుల్ ల్యాప్‌టాప్‌లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. మెటార్ సిల్వర్ కలర్‌లో లభించే ఓమ్నీబుక్ ఎక్స్ ధర రూ.1,39,999. అట్మాస్ఫియరిక్ బ్లూ కలర్‌లో దొరికే ఎలైట్‌బుక్ అల్ట్రా ధర రూ.1,69,934. ఇవి సంస్థకు తొలి కోపైలట్+ సిరీస్ కంప్యూటర్లు కావడం విశేషం. ఇక కీబోర్డ్‌పైనున్న కోపైలట్ బటన్‌తో యూజర్లకు చాట్‌జీపీటీ ఆధారిత సహాయం అందుతుంది. దీనివల్ల కంప్యూటర్‌పై వీడియోల ఎడిటింగ్‌తోపాటు ప్రజెంటేషన్ డెవలపింగ్ సదుపాయాలనూ పొందగలమని హెచ్‌పీ సంస్థ ఈ సందర్భంగా తెలియజేసింది. అలాగే కృత్రిమ మేధస్సు (ఏఐ) సహకారంతో వినియోగదారులు పీడీఎఫ్ ఫైల్స్ లేదా ఏ డాక్యుమెంట్లనైనా అప్‌లోడ్ చేయవచ్చు. అంతేగాక డాక్యుమెంట్ల విశ్లేషణకూ యూజర్లు దీని ఏఐని వాడుకోవచ్చు. ఇందులోని పాలీ కెమెరా ప్రోతో అత్యుత్తమ వీడియో కాన్ఫరెన్సింగ్ చేసుకోవచ్చు. దీనికి స్మార్ట్ 65 వాట్స్ యూఎస్‌బీ టైప్-సీ స్లిమ్ అడాప్టర్ వస్తున్నది. కేవలం 30 నిమిషాల్లో జీరో నుంచి 50 శాతం చార్జింగ్ అవుతుందటం గమనార్హం.

ప్రత్యేకతలు

- విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్
- ఏఐ టెక్నాలజీ, పాలీ కెమెరా ప్రో
- స్నాప్‌డ్రాగన్ ఎక్స్ ఎలైట్ ప్రాసెసర్ 5
- క్వాల్‌కామ్ హెక్సాగాన్ న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ 6
- లాంగ్వేజ్ మాడల్స్ రన్‌కు సెకనుకు 45 లక్షల కోట్ల కార్యకలాపాల సామర్థ్యం
- స్పాట్‌లైట్, బ్యాక్‌గ్రౌండ్ బ్లర్, రిప్లేస్, ఆటో ఫ్రేమింగ్ వంటి అత్యాధునిక పవర్ ఫొటోగ్రఫీ సదుపాయాలు
- 14" 2.2కే డిస్‌ప్లే, బ్యాక్‌లిట్ కీబోర్డ్
- ఇమేజ్-ప్యాడ్, ఇమేజ్ సెన్సార్ క్లిక్ ప్యాడ్, మల్టీ-టచ్ గెస్చర్ సపోర్ట్
- 16జీబీదాకా ర్యామ్, 1టీబీదాకా స్టోరేజీ, 5 మెగాపిక్సల్ ఐఆర్ వెబ్ కెమెరా
- 3-సెల్, 59 వాట్స్ పాలీమర్ బ్యాటరీ
- ఒక్కసారి ఫుల్ చార్జింగ్ చేస్తే 26 గంటలదాకా వాడుకోవచ్చు

తెలంగాణలోకి యూనిటీ బ్యాంక్

ఒకేసారి హైదరాబాద్‌లో ఐదు శాఖలు ప్రారంభం

హైదరాబాద్, జూలై 29: తెలంగాణలోకి యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రవేశించింది. హైదరాబాద్‌లో సోమవారం ఒకేరోజు ఐదు శాఖలను ప్రారంభించింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఎండీ, సీఈవో ఇంద్రజిత్ కమోత్రా మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్, ఎస్ఆర్ నగర్, మౌలాలి, సుచిత్ర క్రాస్‌రోడ్, కూకట్‌పల్లిలో శాఖలను తెరిచినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, దీంతో వేగవంతంగా రుణం మంజూరు చేయడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే వచ్చే మూడు నెలల్లోనే హైదరాబాద్‌లో మరో మూడు, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, విజయవాడల్లోనూ శాఖలను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతోపాటు వచ్చే మూడు నెలల్లో క్రెడిట్ కార్డుతో పాటు వ్యక్తిగత రుణాలు కూడా మంజూరు చేసే ఆలోచనలో బ్యాంక్ ఉన్నదన్నారు. లక్ష నుంచి రూ.5 లక్షల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 9.50 శాతం వరకు వడ్డీని, పొదుపు ఖాతాలపై 7.50 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

నిరుడు రాష్ట్రానికి

28 వేల కోట్ల పెట్టుబడులు

85 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

2,677 పరిశ్రమలకు అనుమతులు మంజూరు

బీఆర్ఎస్ పాలనలో పారిశ్రామిక పరుగులు



హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన టీజీ ఐ-పాస్ (తెలంగాణ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం), టీ-ప్రైడ్ (తెలంగాణ ప్రోగ్రామ్ ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఇంటర్‌ప్రెన్యూర్స్), టీ-ఐడియా (తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్) విధానాలతో అద్భుత ఫలితాలు వచ్చాయి. టీజీ ఐ-పాస్ వల్ల రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రూ.28 వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. తద్వారా సుమారు 85 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టీ-ప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, వికలాంగ వర్గాలకు రూ.402 కోట్ల ప్రోత్సాహకాలను అందించారు. 2023-24 ఆర్థిక సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన స్నేహపూర్వక విధానాలతో తెలంగాణకు పారిశ్రామిక రంగంలో మంచి గుర్తింపు లభించింది. గత ఏడాది కాలంలో 2,677 యూనిట్లకు అనుమతులు జారీచేయగా.. వాటిలో ఇప్పటికే 1,348 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయి. తద్వారా 32,502 మంది ఉపాధి పొందుతున్నారు. జనరల్ క్యాటగిరీ అభ్యర్థులకు సంబంధించిన టీ-ఐడియా స్కీమ్ ద్వారా 2,239 యూనిట్లకు రూ.345.98 కోట్లు మంజూరు చేశారు. ఈ స్కీమ్ కింద యూనిట్లు స్థాపించేవారికి పెట్టుబడి రాయితీలతోపాటు ల్యాండ్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్, ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, పవర్‌కాస్ట్ రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ తదితర ప్రోత్సాహకాలను ఇస్తున్నారు. టీ-ప్రైడ్ కింద ఎస్సీలు ఏర్పాటు చేసుకున్న 2,211 యూనిట్లకు రూ.121.72 కోట్లు, ఎస్టీలకు సంబంధించిన 4,800 యూనిట్లకు రూ.280.18 కోట్లు, వికలాంగులు ఏర్పాటు చేసుకున్న 196 యూనిట్లకు రూ. 13.43 కోట్ల సబ్సిడీలు అందజేశారు.

మెగా ఇండస్ట్రీల పెట్టుబడులు

గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ 3 మెగా ఇండస్ట్రీల నుంచి రూ.22,000 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటిలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ రూ.9,000 కోట్లతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు, గోడీ ఇండియా రూ.8,000 కోట్లతో గిగా స్కేల్ సెల్స్‌తోపాటు లిథియం, సోడియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలను ఏర్పాటు టేయనుండగా.. వెబ్ వర్క్స్ సంస్థ రూ.5,200 కోట్లతో డాటా సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఎంఎస్ఎంఈలు 9.21 లక్షలు

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. తద్వారా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన పరిశ్రమల వివరాల ప్రకారం.. 2020 నుంచి 2024 వరకు 9,21,883 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇందులో తయారీ రంగానికి సంబంధించిన 1,90,669 యూనిట్లు, సేవల రంగానికి చెందిన 7,31,214 యూనిట్లు ఉన్నాయి.

2023-24లో టీజీ-ఐపాస్ ద్వారా వచ్చిన పరిశ్రమలు

2,677	అనుమతులు పొందిన యూనిట్లు
28,126 కోట్లు	ప్రతిపాదిత పెట్టుబడులు
84,929	ప్రతిపాదిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
1,348	ఉత్పత్తి ప్రారంభించిన యూనిట్లు

2023-24లో అందించిన ప్రోత్సాహకాలు

	యూనిట్లు	రూ. కోట్లలో
టీ-ఐడియా ద్వారా	2,239	345.98
టీ-ప్రైడ్ కింద ఎస్సీలు ఏర్పాటు చేసినవి	2,211	121.72
ఎస్టీలు నెలకొల్పినవి	2,211	280.18
వికలాంగులు ఏర్పాటు చేసుకున్నవి	196	13.43

బ్లాక్‌స్టోన్ చేతికి

హల్దీరామ్స్!

న్యూఢిల్లీ, జూలై 29: హల్దీరామ్స్ చేతులు మారబోతున్నది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్.. దేశీయ స్నాక్స్ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భాగంగా హల్దీరామ్స్‌లో మెజారిటీని కొనుగోలు చేయడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి 51 శాతం వాటాను కొనుగోలుకు బిడ్డింగ్ దాఖలు చేసింది. హల్దీరామ్స్ విలువ రూ.70-78 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. దీంతో ఈ వాటా కోసం బ్లాక్‌స్టోన్ రూ.40 వేల కోట్ల వరకు నిధులు వెచ్చించనున్నది.

మరింత దిగిన బంగారం

తులం వెయ్యి రూపాయలదాకా తగ్గుదల

న్యూఢిల్లీ, జూలై 29: బంగారం ధరలు మరింత దిగాయి. దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ పడిపోవడంతో తులం ధర మరో వెయ్యి రూపాయల వరకు దిగొచ్చింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.950 తగ్గి రూ.71,050కి తగ్గింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం పుత్తడి ధర శనివారం రూ.72 వేల స్థాయిలో ఉన్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. పసిడితోపాటు వెండి ఏకంగా రూ.4,500 తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.84,500కి దిగింది. ధర తగ్గకముందు ఇది రూ.89 వేల స్థాయిలో ఉన్నది. ప్రస్తుత సంవత్సరంలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన నాటినుంచి ఇప్పటి వరకు బంగారం, వెండి ధరలు దిగువముఖంగానే పయనిస్తున్నాయి. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 10.60 డాలర్లు పెరిగి 2,438.50 డాలర్లకు చేరుకోగా, వెండి 28.28 డాలర్ల వద్ద ఉన్నది.

చాట్‌బోట్ 'సేవా'

న్యూఢిల్లీ, జూలై 29: మదుపరుల కోసం మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. సోమవారం ఓ చాట్‌బోట్ 'సేవ'ను ప్రారంభించింది. ఈ ఏఐ ఆధారిత సంభాషణ వేదికను బేటా వెర్షన్‌లో తెచ్చామని సెబీ ఓ ప్రకటనలో తెలియజేసింది. సెక్యూరిటీస్ మార్కెట్, తాజా మాస్టర్ సర్క్యులర్లు, సమస్యల పరిష్కారం మొదలైన సాధారణ సమాచార సంబంధిత ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేలా దీన్ని సిద్ధం చేశారు. ఇదిలావుంటే నవంబర్ 1 నుంచి మ్యూచువల్ ఫండ్స్ కోసం ఏఎంసీల్లో మరింత పారదర్శకమైన, ప్రభావవంతమైన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు అమల్లోకి వస్తాయని సెబీ తెలిపింది.

ఓలా ఐపీవో ధర రూ.72-76

ముంబై, జూలై 29: ద్విచక్ర వాహన తయారీదారు ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ.. ఈవారంలోనే ఐపీవోకి రాబోతున్నది. షేర్ల ధరల శ్రేణి రూ.72-76 స్థాయిలో ఉంటుందని ప్రకటించింది. రూ.6,100 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి ఆగస్టు 2 నుంచి 6 వరకు షేర్లను విక్రయించనున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ భావిష్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఆఫర్ ఫర్ సేల్ రూట్ 8.49 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.6 వేల కోట్లకు పైగా నిధులు సమకూరవచ్చునని, ఇలా సేకరించిన నిధులను వ్యాపార విస్తరణ కోసం వినియోగించనున్నట్లు ప్రకటించారు. వీటిలో సెల్ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించడానికి రూ. 1,227 కోట్లు, రీసర్చ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కోసం రూ.1,600 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. అలాగే రూ.800 కోట్ల బకాయిలను చెల్లించనున్నారు.

ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, జూలై 29: ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.2,403 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,709 కోట్ల లాభంతో పోలిస్తే 41 శాతం వృద్ధిని కనబరిచింది. ఏడాది క్రితం రూ.14,759 కోట్లు ఆర్జించిన బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికి రూ.16,945 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 5.47 శాతం నుంచి 3.77 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.70 శాతం నుంచి 0.39 శాతానికి దిగొచ్చింది.

గ్రాండ్ విటారా @ 2 లక్షల యూనిట్లు

న్యూఢిల్లీ, జూలై 29: మారుతి సుజుకీ చెందిన మరో మాడల్ సత్తా చాటింది. మధ్యస్థాయి ఎస్‌యూవీ గ్రాండ్ విటారాకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. మార్కెట్లోకి విడుదల చేసిన 23 నెలల్లోనే 2 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయని కంపెనీ వెల్లడించింది. తొలి లక్ష యూనిట్లు ఏడాదిలోగా అమ్ముడవగా, మరో లక్ష యూనిట్లకు 11 నెలల సమయం పట్టిందని తెలిపింది.

మెరుగైన కరెంటుకు

కెపాసిటర్ బ్యాంకులు

- సర్కిల్ పరిధిలో 189 ఏర్పాటు
- విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల నియంత్రణ
- వ్యవసాయ మోటర్లకు బిగిస్తే మరింత లాభదాయకం
- రైతులు, పరిశ్రమల నిర్వాహకులకు అవగాహన

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు తీరని నష్టాన్ని కలిగిస్తుంటాయి. నియంత్రణ లేని అస్తవ్యస్తమైన సరఫరాతో విలువైన మోటర్లు, విద్యుత్ పరికరాలు పాడైపోతుంటాయి. ఫలితంగా ఇటు వినియోగదారులు అటు విద్యుత్ సంస్థ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఇవన్నీ ఒకెత్తయితే లక్షలాది రూపాయల విలువైన వేలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతున్నది. ఈ తరుణంలో ఎన్పీడీసీఎల్ సంస్థ కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుతో పాటు వాటి సక్రమ నిర్వహణపై దృష్టి సారించింది. కాగా కరీంనగర్ సర్కిల్‌లో కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు దాదాపు తుది దశకు చేరుకున్నది.

కరీంనగర్ ముకరంపుర, జూలై 29 : కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ అనుబంధ పరిశ్రమలతోపాటు వ్యవసాయాధారిత పరిశ్రమలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలు, అందుబాటులోకి వచ్చిన సాగునీటి వనరులతో పంటల సాగు విస్తీర్ణం మరింత విస్తరించింది. కొత్త ఆయకట్టుతో సాగునీటి వినియోగం పెరిగింది. దీంతో జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య లక్ష మార్కును దాటింది. ఇటు వ్యవసాయం, అటు పారిశ్రామిక రంగానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలోనే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కరీంనగర్ సర్కిల్ పరిధిలోని సబ్ స్టేషన్లలో ఇప్పటి వరకు 189 కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేసింది. సబ్ స్టేషన్లలో 1 ఎంవీఏఆర్, 2 ఎంవీఏఆర్ కెపాసిటర్లు, 11 కేవీ లైన్లలో 600 కెపాసిటర్లు అమర్చారు. మరో 12 కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుకు అంతా సిద్ధం చేశారు.

కెపాసిటర్ బ్యాంకు పనితీరు

పరిశ్రమలు, వ్యవసాయ రంగంలో మోటర్లు నడిపించేందుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవసరం. కానీ, సరైన నియంత్రణ లేకపోవడం, సాంకేతిక లోపాలు, లైన్లు దూరంగా ఉండడం వంటి కారణాల వల్ల ఎక్కువ లేదంటే తక్కువ వోల్టేజీతో విద్యుత్ ప్రసారమై మోటర్లు, యంత్రాలు దెబ్బతినే పరిస్థితిని నియంత్రిస్తాయి. రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్‌తో పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పడుతుంది. సబ్ స్టేషన్ నుంచి ఫీడర్ల వారీగా లైన్లకు విద్యుత్ సరఫరాలో ఓవర్‌లోడ్‌ను నియంత్రిస్తుంది. సరఫరాలో హెచ్చుతగ్గుల నియంత్రణతో విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుంది. లైన్ లాసెస్ తగ్గుతాయి. వ్యవసాయ పంపుసెట్లు, పరిశ్రమలోని మోటర్లు కాలకుండా కెపాసిటర్ కాపాడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గి మోటర్లు కాలిపోవని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యుత్ వృథాకు అడ్డుకట్ట

రైతులు సాగునీటి కోసం బావులు, బోర్లలో 5 హెచ్‌పీ అంతకు మించి సామర్థ్యం ఉన్న పంప్ సెట్లను వినియోగిస్తున్నారు. 5 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న ఒక పంపు సెట్ ఒక గంట నడిస్తే 3.8 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది. ఈ లెక్కన రోజుకు8 గంటల పాటు మోటర్ నడిపిస్తే 30.4 యూనిట్ల చొప్పున నెలకు 912 యూనిట్ల విద్యుత్ వినియోగమవుతుంది. అదే కెపాసిటర్ బిగించడం వల్ల రియాక్టివ్ పవర్‌ను '0' గా ఉంచుతుంది. విద్యుత్ వినియోగాన్ని సుమారు 100 యూనిట్ల వరకు తగ్గిస్తుంది. ఈ లెక్కన ఒక 5 హెచ్‌పీ మోటర్ ఉన్న రైతు కెపాసిటర్‌ను బిగించడం ద్వారా ఏడాదికి 1200 యూనిట్ల చొప్పున ఆదా చేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది యూనిట్ల విద్యుత్‌ను వృథా కాకుండా కాపాడుకోవచ్చు. ఓల్టేజీ హెచ్చు తగ్గుల నియంత్రణతో మోటర్‌కు నాణ్యమైన సరఫరాతో మన్నికగా ఉండి లైఫ్ ఎక్కువగా వస్తుంది. పూర్తి సామర్థ్యంతో నీటిని పైకి ఎత్తిపోస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం

కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 18 కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశాం. మరో 12 ఏర్పాటు చేయాల్సి ఉంది. వోల్టేజీ హెచ్చు తగ్గులను నియంత్రించడం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం ఉండదు. లైన్ లాసెస్ తగ్గుతాయి. పారిశ్రామిక వినియోగదారులు, రైతులు కెపాసిటర్లు పెట్టుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

- వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ (కరీంనగర్ సర్కిల్)

చేప పిల్లల పంపిణీపై

నీలి నీడలు

- ముందుకు రాని సీడ్ కంపెనీలు
- నిర్లక్ష్యంగా రాష్ట్ర సర్కారు
- ఆందోళనలో మత్స్యకారులు

పెద్దపల్లి, జూలై 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసే కార్యక్రమంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుండడంతో పథకం పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా గత సర్కారు అనేక ప్రోత్సాహకాలు ఇచ్చింది, మత్స్య సమీకృత అభివృద్ధి పథకం కింద ఉపాధి చూపింది. సబ్సిడీపై వలలు, మోపెడ్‌లు అందించింది. మత్స్య సంపదను సృష్టించడంతోపాటు మత్స్యకారులకు ఉపాధి కలిగే విధంగా రాష్ట్రంలోని అన్ని చెరువులు కుంటలను కోట్ల రూపాయలను వెచ్చించి మిషన్ కాకతీయ కింద ఆధునికీకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరిపై బరాజ్‌లు నిర్మించి వందల కిలోమీటర్ల పొడవునా నీరు నిలిచేలా చేసింది. ప్రతి ఏటా ఉచితంగా చేప విత్తనాలు పంపిణీ చేయడంతో మత్స్య సంపద దండిగా పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

టెండర్లకు వెనుకడుగు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో ప్రభుత్వం తరపున చేప పిల్లలు, రొయ్య పిల్లలను పోసి మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేసేవారు. ఇందుకు జూలైలోనే టెండర్లు పూర్తిచేసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలను పోసేవారు. కానీ, ఈసారి జూలై 15న ఆన్‌లైన్ టెండర్లను పిలిచి, 23న మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరంటే ఒక్కరు కూడా టెండర్లు వేయలేదు. 2023-24 సంవత్సరానికిగాను గత ప్రభుత్వం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో చేప పిల్లలను పంపిణీ చేసింది. అదే సమయంలో ఎన్నికల కోడ్, సార్వత్రిక ఎన్నికలు రావడంతో సీడ్ కంపెనీలకు బిల్లులు ఆగిపోయాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ఈ యేడు టెండర్లు వేసేందుకు కంపెనీలు వెనుకడుగు వేసినట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో టెండర్ల గడువును ప్రభుత్వం వచ్చే నెల 2 మధ్యాహ్నం వరకు పొడిగించింది. అప్పటిలోగా సీడ్ కంపెనీలకు ఉన్న బకాయిలను చెల్లిస్తే తప్ప వాళ్లు టెండర్లకు వచ్చే అవకాశం లేదు. అదే జరిగితే మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయే ప్రమాదం ఉన్నది.

కల నెరవేరిన వేళ

- ఎట్టకేలకు నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులకు మెరుగైన పరిహారం
- ఎకరాకు రూ.6లక్షల నుంచి రూ.18లక్షలకు పెంపు

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితుల కల నెరవేరింది. జిల్లాలోని మంథని-రామగిరి-ముత్తారం మండలాల మీదుగా 16 గ్రామాల్లో విలువైన భూములు, ఇండ్లు కోల్పోతున్న 1,417 మందికి మెరుగైన పరిహారం అందబోతున్నది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో ఎకరాకు రూ.6లక్షల నుంచి రూ.18లక్షల వరకు పెంచుతూ నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే అథారిటీ నిర్ణయం తీసుకోగా, సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

మంథని, జూలై 29: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ దాకా 405 కిలోమీటర్ల మేర కేంద్ర ప్రభుత్వం నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్నది. అందుకు 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయగా, ఇది పట్టణాలు, జనావాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల మీదుగా వెళ్తున్నది. తొలుత ప్యాకేజీ-1 కింద మంచిర్యాల నుంచి వరంగల్ దాకా చేపడుతుండగా, ఇది మంథని-రామగిరి-ముత్తారం మండలాల్లోని 16 గ్రామాల మీదుగా నిర్మాణం జరుగుతున్నది.

మెరుగైన పరిహారం కోసం రైతుల పోరుబాట

హైవే నిర్మాణంలో మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి మండలాలకు చెందిన సుమారు 1,417 మందికి చెందిన విలువైన 500 ఎకరాల భూమితోపాటు ఇండ్లను నిర్వాసితులు కోల్పోతున్నారు. గతంలో ఇక్కడి భూముల మార్కెట్ ధర ఎకరాకు రూ.2 లక్షల వరకు ఉండగా, గ్రీన్ ఫీల్డ్ హైవే నిబంధనల ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు అంటే రూ.6లక్షలు ఇవ్వాలని నిర్ణయించి అవార్డు పాస్ చేసిన విషయం విధితమే. ఇప్పటివరకు దాదాపు 97 మందికి కింద రూ.2.72కోట్లు చెల్లింపులు కూడా చేశారు. మిగతా రైతులు మాత్రం పరిహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తీసుకోలేదు. విలువైన తమ భూములను తక్కువకు తీసుకుంటున్నారని కొద్దిరోజులుగా నిరసనలు కూడా తెలుపుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తులు చేయడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఆందోళన చేశారు.

కలెక్టర్ చొరవ

నిర్వాసితులు మెరుగైన పరిహారం కోసం కలెక్టర్ కోయ శ్రీహర్షను ప్రత్యేకంగా కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ క్రమంలో స్పందించిన కలెక్టర్ పరిహారం పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువను ఎకరాకు ₹6 లక్షలకు పెంచడంతోపాటు గ్రీన్ ఫీల్డ్ హైవే నిబంధనల ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు అంటే ఎకరానికి ₹18 లక్షల వరకు పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే అవార్డు పాస్ అయిన తేదీ నుంచి ₹18లక్షలకు వడ్డీతో కలిపి పరిహారం ఇవ్వాలనే మార్గదర్శకాలతో ఒక్కో రైతుకు ఎకరానికి ₹20లక్షల పైనే పరిహారం అందే అవకాశం ఉంది.

అర్బిట్రేటర్ ట్రిబ్యునల్ ద్వారానే కొత్త పరిహారం

నిర్వాసితులు కొత్త పరిహారం పొందాలంటే గతంలో పాస్ చేసిన అవార్డు ప్రకారం పరిహారాన్ని పొందాల్సి ఉంటుంది. తర్వాత అర్బిట్రేటర్ ట్రిబ్యునల్